# న్యూఆనంద్ హోటల్ - ఫాస్ట్‌ఫుడ్ సెంటర్

ముదిగంటి సుజాతారెడ్డి

కథ

"రోడ్డు వెడల్పు పనులు మొదలైనయి. కొన్ని రోజులైతె మన హోటల్ కాడికి వస్తరు" ఇంట్లోకి వస్తూనే అన్నాడు సురేశ్.

"హోటల్‌కేమైన ముప్పు వస్తద? సూరయ్యా!" భయంగా నోరు తెరిచాడు లాలయ్య.

లాలయ్య తండ్రి పేరు సూరయ్య. అందుకే కొడుకు పేరు సురేశ్. మరీ సూరయ్య అని అంటె మోటుగా వుంటుందని అట్లా నామకరణం చేసాడు లాలయ్య. అయినా తను మాత్రం సురేశ్‌ను సూరయ్య అనే పిలుస్తాడు.

సురేశ్ తండ్రి మాట విని చిరాకుపడ్డాడు.

"హోటల్ రోడ్డుమీదనే వుండే!... హోటల్ లోపటికి సగందాకా పోయెటట్లున్నది"

"సగం దనుక పోయినంక ఇగేం జాగ మిగుల్తది?" గుణిగాడు లాలయ్య.

"ఏంజేస్తం! గవుర్నమెంటు ఖానూన్ గట్లున్నది. ఏమన్నంటె రూల్సు అంట మాటాడ్తున్నరు" సురేశ్ స్వగతంలాగానే అన్నాడు.

"సూరయ్యా! ఏమైన భూమి ధర కట్టిస్తరంటన?" మొఖంపైకెత్తి మురికైన అద్దాలల్లోంచి కొడుకువైపు ఆత్రంగా చూస్తూ అడిగాడు లాలయ్య.

"ఏదో మొక్కుబడిగ కట్టిస్తరు. బజారు ధర ఇస్తర ఏంది!" సురేశ్ గొంతులో చిరాకు కోపం.

"ఎవలు ఏమంటలేర!...ఎమ్మెల్యేలు...నాయకులు?" లాలయ్య కొడుకువైపు దృష్టి సారించాడు. కాని అతనికేదీ స్పష్టంగా కన్పించడంలేదు.

"అందరూ గదే పాట!... రూల్సు గట్లున్నయి ఏంజేస్తమంటున్నరు! కోర్టుకు పోయిన ఏం ఫాయిద లేదంటున్నరు. ఇగ వాల్లు పరిహారంగ ఇచ్చే పైసలు కండ్లు తుడుపుడుకే వున్నయి. వాళ్ళిచ్చిన కాడికి తీస్కోని నోరు మూస్కోవాలె... సరే! గదోటి బాగనే వున్నది... పైసలు గక్కడిది గక్కడ్నె పేమెంటు జేస్తున్నరు. ఇంక పైన రెండు మూడంతస్తులు కట్టుకునెటందుకు గక్కడిది గక్కడ్నె పర్మిషన్ ఇచ్చేస్తున్నరు! లేకపోతె మున్సిపల్ ఆఫీసు చుట్టు ఎన్ని మల్కల తిర్గి ఎంతమందికి తినిపిస్తె గా పని అయితది! గదోటి మంచిగనె వున్నది." సురేశ్ గొంతులో తృప్తికన్పించింది.

"లక్షల విలువజేసె భూమి పోతున్నది. గా పర్మిషనుకు సంబురపడ్తున్నవ్!" కొడుకువైపు తీక్షణంగా చూసాడు లాలయ్య.

"సంబురపడక ఏంజెయ్యమంటవు? ఏడ్సుకుంట కూసోమంటవ? గట్ల కూసుంటె పనులయితయ? ఎన్కతెన్కకు చూసుకుంట కూసుంటె బతికేదెట్ల!" సూరయ్యగొంతు తీక్షణంగానే ధ్వనించింది.

"ఏమైతదో యేందో!" అనుకుంటూ లాలయ్య విచారంగా తలదించుకున్నాడు. లాలయ్య ముప్పైయేండ్ల కింద పెండ్లాం పుల్లమ్మను తీసుకొని పట్నం వచ్చాడు. కూలినాలి చేసే అలవాటు లేదు. తండ్రి తాత ఊర్లెదొరల దగ్గర వంట పనులు చేసి బతికారు. లాలయ్యా అదే పనిలో చేరాడు చిన్నప్పుడే. రానురాను ఊర్లె దొరలు దాతలు లేకుంటపోయారు. నాలుగెకరాల చెల్కవుంది. గాని వానపడితేనే ఆ ఎర్రనేల కుంకుమపువ్వు లెక్క వుంటది. నాగలికి వంగుతది. అదే వాన పడకపోతె ఎర్రటి చెక్కయి పక్కున పగులుతది. కర్రువంకర పోవలసిందేగాని నాగలికి వంగడు. బిర్ర బిగుస్కపోతది. అసొంటి భూమిల యేం పండిస్తం? నీళ్ళ ఒనరు వుంటె యేమైన పంట పండుతది. నీళ్ళ పారుదల లేదాయె. ఎకరానికి ఎకరానికి యెక్కడ బోరు యేస్తం! అయినా బోరు యేయాలంటె పెట్టుబడిగావాలె! ఎక్కడ్నుంచి తేవాలె! పట్నానికైన బతుకబోత" అని లాలయ్య ఊరినుంచి కదిలాడు. పట్నం వచ్చి హోటల్లో వంటకు కుదిరాడు. ఇన్ని పైసలు వెనుకేసుకొని సొంతంగా తనే హోటల్ తెరిచాడు. ఆనంద్ హోటల్ అని పేరు పెట్టాడు. చాయ్, పూరీ, పూరీలతో ఉల్లిగడ్డ కూర పెట్టాడు. వాటితోనే అతని హోటల్ బాగా నడిచింది. వంట పనంత లాలయ్య పుల్లమ్మలే చూసుకునేవాళ్ళు. అప్పుడే తొల్సూరు కొడుకు సురేశ్ పుట్టాడు. పుల్లమ్మ కొడుకుతో ఇంట్లో నుంచి కదలకుంటయింది. కొడుకు పుట్టిన వేళావిశేషమేందో లాలయ్య హోటల్ నడిపే మడిగె అమ్మకానికి వచ్చింది. తను కూడబెట్టిన డబ్బు పుల్లమ్మ మీది బంగారు గుండ్లు, వెండి దండెకడెం అమ్మి లాలయ్య ఆ మడిగె కొన్నాడు. హోటల్ అతని సొంతం అయింది. వెనకున్న జాగా అమ్మకానికి వస్తే అదీ కొన్నాడు. వంటిల్లును గ్యాసుపొయ్యిలతో ఆధునికంగా మార్చాడు. నలుగురు వంటవాళ్ళను ఐదారుగురు సర్వర్లను, పదిమంది పనివాళ్ళను పెట్టుకున్నాడు. చాయ్ పూరీ కూరనేగాక ఇడ్లీ దోసెలు పెట్టాడు. లామినేషన్ వేసిన కొత్త టేబిళ్ళు కుర్చీలు చేయించాడు. తను కూర్చొని డబ్బు వసూలు చేసుకునేచోట గల్లాపెట్టెతో చక్కని టేబిల్ చేయించుకొని లాలయ్య అక్కడే కూర్చొని హోటల్ వ్యవహారాలు చూసుకోవడం మొదలుపెట్టాడు. హోటల్‌ను అంతా కొత్తగా చేసాడు. "ఆనంద్ హోటల్" అని రాసివున్న సైన్‌బోర్డును కొత్తగా రాయించి "న్యూ" అనేది ముందుగా తగిలించి హోటల్ పేరును "న్యూ ఆనంద్ హోటల్"గా మార్చాడు. న్యూఆనంద్ హోటల్ పూరీకూర ఇడ్లీ సాంబరు దోసెలు చాల పేరు బోయినయి. ఎక్కడెక్కడి వాళ్ళో అక్కడ టిఫిన్లు రుచిగా శుభ్రంగా వుంటాయని అక్కడికి వచ్చి తినేవాళ్ళు. ప్యాక్ చేయించుకొని తీసుకెళ్ళేవాళ్ళు.

లాలయ్యకు కొడుకు తర్వాత ఇద్దరు కూతుళ్ళు పుట్టారు. పుల్లమ్మ ఇంటికి, పిల్లలకే అంకితమైపోయింది. పనిమనుషులు సక్రమంగా పని చేస్తున్నారా లేదా అని చూసుకోవడంతోనే రోజంతా ఆమెకు సరిపోయేది. అందులో లాలయ్య లాభాలు పెరిగినకొద్ది ఇల్లూ అంతస్తు మీద అంతస్తు లేచి పెద్ద భవనమైంది. ఆ ఇల్లూ సంసారంతో పుల్లమ్మకు పనితీరేదే కాదు. ఇక లాలయ్య ఒక్కడే హోటల్ వ్యవహారాలు చూసుకోవడం కష్టమైంది. అప్పుడే సురేశ్‌ను బి.ఏ చదవడం ఆపించేసి హోటల్లో కలెక్షన్‌చోట గల్లాపెట్టె దగ్గర కూర్చోబెట్టాడు. తనేమొ అటు వంటింట్లో ఇటు హోటల్లో అన్నీ సక్రమంగా వున్నాయా అని చేసుకునేవాడు. ఇద్దరు కూతుళ్ళ పెండ్లిళ్ళు చేసాడు. వాళ్ళను మంచి వ్యాపారం చేసుకునేవాళ్ళకే పట్నం



లోనే ఇచ్చాడు. తర్వాత కొడుకు సురేశ్ పెండ్లీ చేసాడు. క్రమంగా లాలయ్యకు కండ్లు కన్పించలేదు. సురేశ్ డాక్టరు దగ్గరికి తీసుకపోయి చూపించాడు.

"ఏంలేదు. కండ్లల్లో పొరలు వచ్చాయి. ఆపరేషన్ చేయాలి" అన్నాడు...

"ఆపరేషన్ కూడా కాదు ఇప్పుడు లేజర్ ట్రీట్‌మెంట్ వచ్చింది. దాంతో మీరు ఆపరేషన్ అయిన నాలుగైదు గంటలకే ఇంటికి వెళ్ళిపోవచ్చు" అన్నాడు డాక్టరు. కాని కండ్లకు ఆపరేషన్ అనగానే లాలయ్య భయపడిపోయాడు. తన తాతలాగా తనెక్కడ గుడ్డివాడినైపోతానేమోనని భయపడ్డాడు.

"కండ్లు అంతో యింతో కన్పిస్తున్నాయి. ఆపరేషన్ జేస్తె గుడ్డోన్ని అయిపోత. నాకు ఆపరేషనొద్దు ఏమొద్దు!" అని మంకుపట్టు పట్టాడు. అప్పట్నుంచి లాలయ్య ఇంట్లోనే వుంటున్నాడు. హోటల్‌నంతా సురేశే చూసుకుంటున్నాడు.

అట్లా మూడు దశాబ్దాల నుంచి నడుస్తున్న ఆనంద్ హోటల్‌కు ఇప్పుడు ముప్పు ముంచుకొచ్చింది. రోడ్డు విస్తరణతో ముందుభాగం సగంవరకూ పోయేటట్లుంది. లాలయ్యకు అది తలచుకుంటేనే ఆందోళనగావుంది. అది చూసి పుల్లమ్మ కోప్పడింది.

"అదంత నీకెందుకు. అంత సూరయ్య చూసుకుంటడు. అక్కర్లేకుంట నీ ఆరోగ్యం పాడుచేసుకోకు! ఆరాటం పెట్టుకుంటె కండ్లు బొత్తిగ కనపడకుంట అయితయని డాక్టరు చెప్పలేద! నీకెందుకీ రంది"

కాని లాలయ్య ఆందోళన ఆగేదికాదు. రోజూ కొడుకు ఇంటికి రాంగనే-

"సూరయ్య! ఏమైందీ రోజు?" అని అడిగేవాడు. రోజురోజు ఏమౌతుందో తెలుసుకుంటూనే వున్నాడు.

"రోడ్డు విస్తరణ హోటల్‌కాడికి వచ్చింది!" అన్నాడో రోజు సురేశ్.

ఆరోజు లాలయ్య ఆందోళన మరింత ఎక్కువైంది.

"నువ్విట్ల పరేషానయితె కండ్లు నెరీ పాడతయి అంటె వినవు. గివన్ని పట్టిచుకోవద్దంటె వినవు! కండ్లు పొరలు తీస్తమంటె తీయించుకోవు! కండ్లు కనపడకుంటె గట్ల గుడ్డోని లెక్క వుంటనంటవ్‌గాని బాగజేయించుకోవు!" అని పుల్లమ్మ లొల్లిపెట్టింది.

"నేనుగా ఆపరేషన్ చేయించుకోనే! ఎన్కట గా ఆపరేషన్ తోటే మా తాత కండ్లు పోయినయి. గిప్పుడు నేను మస్కమస్కగనైన చూస్తున్న ఆపరేషన్ జేస్తె పూరాగా కండ్లు పోతె ఏంజేస్తం! నేనుగా ఆపరేషన్ చేయించుకోను!" కోపంగా అరిచాడు లాలయ్య.

"సరే బాగుంది! ఎన్కట ఎవడో డబ్బు పట్టుకొని కండ్ల పొరలు తీస్తనని ఊల్లెకు వస్తే మీ తాత గాయనతోటి ఆపరేషన్ చేయించుకుండు. వాడేం జేసిండో కండ్లచూపు పోయింది. వాడు డాక్టరే కాదాయె! గిప్పుడేమొ మస్తు చదువుకున్న డాక్టర్లు ఆపరేషన్ జేస్తరంటె ఉత్త పుణ్యానికి భయపడవడ్తివి. గిప్పుడేమొ లేజ ర్‌తోటి ఛణంల పొరలు దీస్తరట అయిన జంకవడ్తివి. ఏంజెయ్యాలె!" పుల్లమ్మ యాష్టపడింది.

"నేను గా ఆపరేషన్ జేయించుకోనే! కావలిస్తే నువ్వు జేయించుకోపో!" కోపంగా లాలయ్య వణికిపోయాడు.

"నాకెందుకు ఆపరేషన్! నాకేమైన కండ్లల్ల పొరలు కమ్మినయ నీ లెక్క!" మూతి ముడిచింది పుల్లమ్మ.

రోజురోజుకు లాలయ్య పరేషానిఎక్కువైంది.

**సురేశ్ రెండంతస్తుల మేడను కట్టాడు. పై అంతస్తును మంచి కిరాయికే కంప్యూటరు వాళ్ళకిచ్చేసాడు. మిగతా జాగాలో హోటల్‌ను ఫాస్టుఫుడ్ సెంటర్‌గా మార్చేసాడు. వంటిల్లును ఆధునికం చేసాడు. రోళ్ళు రుబ్బురాళ్ళను పారేయించాడు. ఎలక్ట్రిక్ రుబ్బే మెషీన్లు కొన్నాడు. ఇడ్లీలు ఒక్కసారే వందలకొద్ది ఆవిరిమీద తయారయ్యే ఎలక్ట్రిక్ స్టౌవ్ కొన్నాడు.**

"నీకు చింత ఎందుకు నాయన! నేను జూసుకుంట గద! ఏం భయంలేదు" తండ్రి ఆందోళన తగ్గించాలని చూసాడు సురేశ్.

"అంటె హోటల్ జాగ ఏం పోతలేద!" ఆత్రంగ అడిగాడు లాలయ్య.

"జాగ ముందలిది పోతున్నది నాయన! కాని ఎన్క జాగ మంచిగనె వుంటది. బ్యాంకులోను ఇస్తరంట. లోను తీసుకొని హోటల్ పూరా కొత్తగ జేయిస్త. పైన రెండంతస్తులేస్తె ఒక అంతస్తు హోటల్‌కు వుంచుకున్నా ఇంకో అంతస్తు ఏ కంప్యూటరు వాళ్ళకో కిరాయికిస్తే మంచి కిరాయి వస్తది. గిప్పుడు కంప్యూటర్లు పెట్టుకుంటమని మస్తుగ మడిగెలు అడుగుతుండ్రు. కిరాయిలు మంచిగనే ఇస్తుండ్రు. హోటల్ అంత పాతగైంది. కొత్తకొత్త హోటళ్ళు శాన వచ్చినయి గద! మన హోటల్‌కు మంది తక్కువనే అయిండ్రు. ఇగ గిప్పుడు అంత కొత్తగ జేస్తె రోడ్డు మీద ట్రాఫిక్కు రద్దీ ఎక్కువైతది గద హోటల్‌కు సుతమంది మస్తుగ వస్తరు. గిరాకీ పెరుగుతది!" తండ్రికి వివరించి చెప్పాడు సురేశ్.

"హోటల్ల రద్దీ తక్కువైందంటున్నవు! పూరీ ఇడ్లీ దోసెల్ల క్వాలిటీ యేమైన దెబ్బతిన్నద? ఏంది?" అడిగాడు లాలయ్య మొదటి పాయింటు పట్టుకొని.

"క్వాలిటీగాదు నాయన! మస్తుగ కొత్తకొత్త హోటల్లు వచ్చినయి అని చెప్పినగద! గందుకె!"

"అనవసరంగ పైసలు దండుగపెట్టకు! పెట్టే తిండి క్వాలిటీ బాగుండాలె! గక్కడ యేం లోపం రానియ్యకురా!" హెచ్చరించాడు లాలయ్య.

"నా చేతి నుంచి యేంపెట్ట. బ్యాంకులోను తీస్కుంట! నువ్వేం బుగులుగాకు నాయన! అక్కడ్నుంచి కదిలాడు సురేశ్.

లాలయ్య నిట్టూర్చాడు.

"కాలం మారిపోతున్నది! గీకాలపోల్లు మనం జెప్పినట్ల వింటర ఏమన్నన? కష్టం జేసుకొని చెమటోడ్చి సంపాదించిందానిల ఎన్కకు వేస్కొని హోటల్ పెద్దది జేసిన. న్యూ ఆనంద్ హోటల్‌గ మార్చిన. గాని గిట్ల బ్యాంకులోన్లు ఎత్తలేదు నేను! లోనుల బొందలల్లపడి సూరయ్య ఏం జేస్తడో సంసారం! అప్పుఅంటె ఎంత జెనికేది నేను! వీడేమొ అప్పు అంటె లెక్కలేనట్లు



బ్యాంకోడు దానమిచ్చినట్లు మాట్లాడ్తున్నడు!" సురేశ్ మాటలు విని ఇంకా ఎక్కువ పరేషానిలో పడ్డాడు లాలయ్య. అతని ముఖంలో విషాద మేఘాలు కమ్ముకున్నాయి.

బుల్‌డోజర్ ఒకరోజు హోటల్ ముందు భాగాన్నంతా కూల్చేసింది. అంతకుముందే సురేశ్ బ్యాంకులో లోను కోసం దరఖాస్తు పెట్టాడు. మునుపటి లెక్క బ్యాంకు చుట్టు తిరుగుడుగాని తినిపించుడుగాని లేదు. ఒక్క రోజులో లోను వచ్చేసింది. సురేశ్ వెంటనే హోటల్ నిర్మాణాన్ని మొదలుపెట్టాడు. రోడ్డు విస్తరణ అయి అక్కడ ఫ్లైఓవరు వచ్చేసరికి సురేశ్ రెండంతస్తుల మేడను కట్టాడు. పై అంతస్తును మంచి కిరాయికే కంప్యూటరు వాళ్ళకిచ్చేసాడు. మిగతా జాగాలో హోటల్‌ను ఫాస్టుఫుడ్ సెంటర్‌గా మార్చేసాడు. వంటిల్లును ఆధునికం చేసాడు. రోళ్ళు రుబ్బురాళ్ళను పారేయించాడు. ఎలక్ట్రిక్ రుబ్బే మెషీన్లు కొన్నాడు. ఇడ్లీలు ఒక్కసారే వందలకొద్ది ఆవిరి మీద తయారయ్యే ఎలక్ట్రిక్ స్టౌవ్ కొన్నాడు. అదేవిధంగా దోసెలు కాల్చే ఎలక్ట్రిక్ పెనాన్ని జర్మనీ నుంచి తెప్పించాడు. వండిన వంటకాలను ఎప్పుడూ వేడిగా వుంచేందుకు జపాన్ నుంచి అవన్లు కొన్నాడు. మునుపటి లెక్క రుబ్బేటందుకు వంటకూ ఎక్కువ పనివాళ్ళే అక్కర్లేదు. ఇక పైఅంతస్తులో కిందా కస్టమర్లు మునుపు తీరికగా కూర్చొని తినేచోట కుర్చీలు బల్లలు తీసేసి నిలబడి తినడానికి అనువుగా నున్నని నల్లని మెరిసే రాతిబండలు వేయించాడు. మునుపు బోలెడుమంది సర్వర్లు, క్లీనింగు బాయస్ అవసరముండేది. ఇప్పుడు వాళ్ళందరు అక్కరేలేదు. ఇప్పుడు కస్టమర్లే గల్లాపెట్టె దగ్గర ఏంకావాలో చెప్పి టిక్కట్లు కొనుక్కుంటారు. వాటిని వంటింటి దగ్గరున్న కౌంటరులో ఇచ్చేస్తే ఒకరిద్దరు అవన్లలో రెడీగా వున్న పదార్థాలను ప్లేట్లల్లో పెట్టియిస్తారు. కస్టమర్లు తామే మోసుకొచ్చుకొని నిలబడే రాతిబండల మీద ప్లేట్లు పెట్టుకొని తినేస్తారు. ఎంగిలి ప్లేట్లను మాత్రం ఒకరిద్దరు బాయస్ తీస్కొనిపోయి పడేస్తే కడగటానికి వాష్ డిషర్లు కొన్నాడు. క్షణాల్లో బోలెడు ప్లేట్లు గిన్నెలను శుభ్రంగా కడిగిపారేస్తాయి ఆ మెషీన్లు. ఊడ్వడానికి తుడ్వడానికి మెషీన్లే! ఇక సర్వర్లు అనీ క్లీనర్లు అనీ వంటవాళ్ళు రుబ్బేవాళ్ళు అనీ ఎక్కువ ఖర్చేలేదు. ఆ పనివాళ్ళతో తిప్పలే లేవు! అంతా మెషీన్లే! హోటల్ గోడలకు కొత్తగా బజార్లో వచ్చిన అందమైన టైల్స్! హోటలంతా జగజగమనీ! హోటల్లో పూరీ ఇడ్లీ దోసెలతోపాటు పీజ్జా, బర్గర్ల విభాగం ఒకటి ఓపెన్ చేసాడు సురేశ్. ఇప్పటి యువతరం అవే కావాలంటున్నారు. వెడల్పైన రోడ్డు! అంతా నున్నగా. రోడ్డు మధ్య ఎత్తైన ఫ్లైఓవర్. ఫ్లైఓవర్ కింద పచ్చని చెట్లు! బోలెడు కార్లు! స్కూటర్లు! మోటర్ సైకిళ్ళు! ఆటోలు! జనం రద్దీ ఎక్కువైంది. హోటల్ అందరికీ కనిపించేట్లుగా జిగేల్‌మనే లైట్లు! అద్దాలు! అలంకారాలు! ఒక పక్క పెద్ద చాట్ తెరిచాడు. ఏది కావాల్సిన వాళ్ళకు అదీ! హోటల్ పేరును కొత్తగా రాయించాడు సురేశ్. "న్యూ ఆనంద్ హోటల్" అన్న పేరు చిన్నక్షరాల్లో వుంది. పెద్దపెద్ద అక్షరాల్లో లైట్ల వెలుగులో మెరిసేట్లుగా "ఫాస్ట్‌ఫుడ్ సెంటర్" అనే పదాలు బోర్డు మీద వున్నాయి. హోటల్ అందర్నీ ఆకర్షించేందుకు అన్ని హంగులున్నాయి.



ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ గురించి లాలయ్యకు తెలిసింది. అవాక్కయిపోయాడు. ఇదా వాడు చేసిన పని! లోను తీస్కొని చేసిన అభివృద్ధి! రోడ్డు విస్తరణ ఫ్లైఓవర్ పేరుతో జాగపోతున్నదని బాధపడ్డాడు. కాని ఈ మార్పునూహించలేదు! హోటల్ గురించి విని తట్టుకోలేకపోయాడు లాలయ్య. "ఏం నాశనగాలమిది! గీ ఆలోచన ఎక్కడ్నుంచి వచ్చింది వీనికి. హోటల్ల ఎంతమంది పనిజేసెటోల్లు! అందరం ఒక్క ఇల్లు లెక్క వుండెటోల్లం! వాళ్ళెక్కడికని పోతరు పొట్ట చేతబట్టుకొని! వాళ్ళ పెండ్లాం పిల్లల గోస తగులదా మనకు! వాళ్ళు ఎన్నాళ్ళబట్టీ మనలో ఒకరయి కష్టసుఖాలు పంచుకున్నరు! వాళ్ళ నౌకరీలు పోతె ఆ ఉసురు ఎవరికి తగులుతదో చెప్పు? గట్ల వాళ్ళ బతుకులల్ల నిప్పులు పోసినోళ్ళం అయినమలేదా? గదే ఫికరు! గదే రంధి! గదే చింత! గదే పరేషానీ నాకు! నేను రోజురోజు ఏమైందని అడుగుతుంటె మరేమొ వేరే తీరుగ తీసుకున్నరు!" లాలయ్య కండ్లు కన్నీళ్ళతో నిండినయి. అది చూసి పుల్లమ్మ మనస్సు నొచ్చుకుంది. "అయ్యో! గిదంత నేనాలోచించలేదయ్యా! నువ్వు ఫికరయితుంటె నీ కండ్లు పోతయని రంధి పెట్టుకున్న! ఆపరేషన్ చేయించుకొమ్మంటె చేయించుకోకపోతివి! కొత్తకొత్త తరీఖలు వచ్చినయన్న చెవున బెట్టకపోతివి!...." పుల్లమ్మ మాటలు పూర్తికాకముందే అందుకున్నాడు లాలయ్య.

> ***హోటల్ ఎంతో అభివృద్ధి జేసిండు కొడుకు అని ఖుషీ అయితున్నవు! వాడూ ఖుషీ అయితుండు! వాళ్ళను వెళ్ళగొడితే ఎక్కడికని పోతరు! నాకు కండ్లు కనవడ్త లేవంటున్నవు! మీకందరికి కండ్లు కన్పిస్తున్నాయే? చెప్పు? గిట్లనేన అన్నాలం పనులు చేసేది? నేను గింతకాలం ఎంతమందికి పనులు కల్పించిన! మనం తింటె నలుగురు తినాలె బతుకాలని అనుకున్న! మనతోపాటు నలుగురు బాగుపడాలనుకున్నగాని లాభాలుగావాలని లాభాలతోటి నా జేబులు నింపుకోవాలని అనుకోలేదు నేను.***

"అవునే! నేను వింటలేను! మొండికేస్తున్న నిజమే! గాని వాడు... నీ కొడుకు చేస్తున్న పనేమన్న బాగుంద చెప్పు? హోటల్ల పనోళ్ళు ఇన్నాళ్ళు మనలను నమ్ముకొని పనులు జేసిండ్రు. గిప్పుడు ఎక్కడికి పనులు దేవులాడుకుంటపోతరు వాళ్ళు! హోటల్ ఎంతో అభివృద్ధి జేసిండు కొడుకు అని ఖుషీ అయితున్నవు! వాడూ ఖుషీ అయితుండు! వాళ్ళను వెళ్ళగొడితే ఎక్కడికని పోతరు! నాకు కండ్లు కనపడ్త లేవంటున్నవు!. మీకందరికి కండ్లు కన్పిస్తున్నాయే? చెప్పు? గిట్లనేన అన్నాలం పనులు చేసేది? నేను గింతకాలం ఎంతమందికి పనులు కల్పించిన! మనం తింటె నలుగురు తినాలె బతుకాలని అనుకున్న! మనతోపాటు నలుగురు బాగుపడాలనుకున్నగాని లాభాలుగావాలని లాభాలతోటి నా జేబులు నింపుకోవాలని అనుకోలేదు నేను. వాడు... సురేశ్ గట్ల ఆలోచిస్తున్నడు. లాభాలు ఎక్కువ ఆర్జించాలని చూస్తున్నడు! లాభాలన్నీ తనే తినాలని అనుకుంటున్నడు! మరి మనల్ని నమ్ముకున్న పనోళ్ళు అన్నమో రామచంద్ర అనుకుంట ఎక్కడికి పోతరు గిప్పుడు చెప్పు నాకు?..." బోరున యేడ్చాడు లాలయ్య. అది చూసి పుల్లమ్మ హక్కాబక్కా అయింది. ఆమెకేం అర్థంకాలేదు. భర్తకు ఎందుకీ దుఃఖం.

"ఊకోవయ్య ఏడ్వకు! అంత సక్కగైతదిలే! లోను తీసుకొని సురేశ్ అంత బాగ జేసిండుగద!" అంది పుల్లమ్మ.

"మల్లగదే మాటంటవు! నీ అవ్వ! లోను దీస్తడు! లోను దీస్తడు... లాభాలు వస్తయి అను అనుడేగాని పనోల్లు ఏమైతరు వాళ్ళ నోటికి కూడెక్కడ్నుంచి వస్తదని ఆలోచిస్తున్నర! మెషీన్లు దెచ్చిండట! అన్ని తీర్ల పనులు జేస్తయట! ఛణంల జేసిపెడ్తయట! ఎందుకే ఆ ఉరుకులు పరుగులు! పదిమంది నోళ్ళు గొట్టే ఆ మిషన్లు ఎందుకే! వాటి నోట్లె మన్నువడ!.... నేను గుడ్డోన్నిగాదె మీరు గుడ్డోల్లు! ఆడు... ఆ సురేశ్ గుడ్డోడు!... మీకు ఎవ్వరెట్ల పోతరని రంధిలేదు. మీకు ఎవరి జోలి అక్కర్లేదు!..." లాలయ్య ఆవేశంగా అంటూ పోతున్నాడు.

"సరే! గా పనోళ్ళ గురించి నీకెందుకయ్యగంత ఆరాటం! ఫికరు! ఎటన్నబోయి ఏ పనన్న జూసుకోని బతుకుతరు!" పుల్లమ్మ గొంతు శాంతంగా వుంది.

"ఎంత నిమ్మలంగ మాట్లాడ్తున్నవె! నీ కడుపు మండితే తెలిసొచ్చేది నీకు! ఇన్నాళ్ళు గిక్కడ పనిజేసినోళ్ళు గిప్పుడు ఎక్కడ పని దేవులాడుకుంటపోతరే! వాళ్ళకు యేం పని దొరుకుతదే! అందరు గిదే పాలసి అయినంక పనులేం వుంటయే! రోడ్డు వెడల్పు జేస్తున్నరు! ఫ్లైఓవరు కడ్తున్నరు! అని విని ఏమేమొ అయితదనుకున్న. గాని మంది నోళ్ళల్ల మన్ను వడ్తదనుకోలేదు! ముంగలున్న కూడును గుంజేస్తరనుకోలేదు! నలుగురికి పని కల్పించాలెగాని పనిజేసెటోళ్ళను కమ్మిజేస్తె వాళ్ళెక్కడి పోవాల్నె? వాళ్ళ పెండ్లాం పిల్లలు ఏమైతరు? మీకేమీ సమఝయితలేదు. కాలం గింత అన్నాలం అయిపోయిందేందే!..." లాలయ్య విలపించాడు! అతని అంతరాత్మ ఘోషించింది! ●